


# హద్దులు

పి. ఇందిరాదేవి

"విజ్జీ! ఇవాళెంత అదృష్టం వరించిందో చూశావా? ఓ గొప్ప వ్యక్తిని కలుసుకున్నాను" ఆనందంగా అంటూ ఇంట్లో కొచ్చింది నిషా.

"తెలుసులే! ఏ రచయితన్నో కలుసుకుని ఉంటావ్. అంతేగా?" తేలికగా అంది విజయ.

దాంతో నిషాలోని ఉత్సాహ మంతా చప్పున చల్లారిపోయింది.

"అంటే రచయితల్లో గొప్పతనం ఏమీ లేదం టావా?" నిష్ఠూరంగా అడిగింది.

"ఉంటే ఉండవచ్చు - లేకపోతే లేకపోవచ్చు. అయినా రచయితలను దేవుళ్ళలాగా చూసే నీ మూర్ఖత్వం, పిచ్చితనం చూస్తూంటే నాకు జాలే స్తోంది."

"అవునవున్లే! అసలు నీకు ఎవరన్నా కూడా చులకనే! ఎవరి గురించి. చెప్పినా ఇలాగే అంటావ్! రచయితలంటే అస్సలు పడదు నీకు — అయినా దేనికయినా ఓ అభిరుచి అనేది ఉండాలి. సాహిత్యం మీద మంచి అభిరుచి వుంటే రచయితల గొప్పతనం నీకు తెలుస్తుంది."

విజయ తన బుక్స్ తీసుకుని "పద! టైమ యింది" అంటూ బయటకు నడిచింది. నిషా ఆమె ననుసరించింది.

బస్‌స్టాప్ వరకూ ఎవరూ ఏమీ మాట్లాడలేదు మళ్ళీ.

నిషాకు ఇంకా కోపం తగ్గలేదు విజయ మీద.

రచయితలు, రచనల విషయంలో ఇద్దరికీ ఎప్పుడూ అభిప్రాయభేదాలే!

"అయినా రచయితలంటే నీ కెందుకంత చిన్న చూపు?" అడిగింది నిషా మళ్ళీ.

"ఎందుకంటే సంఘానికి నీతులు చెప్పే ఈ రచయితలు తమ జీవితంలోకొచ్చేసరికి చేసేవన్నీ వెధవ పనులే! నేను రచయితలందరూ అలా ఉంటా రని అనడంలేదు. అలా వుండే ఆ కొంతమంది గురించే మాట్లాడుతున్నాను. రాజకీయ నాయకులు, సినిమా హీరోహీరోయిన్లు, రచయితలూ, సంఘ సేవ కులూ, ఇలా అందరిలోనూ పూర్తిగా దిగజారి పోయిన ప్రముఖులున్నారు!"

బస్ వచ్చేసరికి నిషా ఏమి మాట్లాడ్డానికీ వీల్లేక పోయింది. అయితే ఆమె ముఖమంతా కోపంతో జేవురించింది.

*　*　*

కాలేజ్‌లో క్లాస్‌లో కూర్చుని కూడా చాలాసేపు నిషా గురించే ఆలోచిస్తూ గడిపింది విజయ.

ఆమె రచయితలను ఎందుకంతగా ఆరాధిస్తుందో తెలీదు. ఏ చెత్త నవల చదివినా 'అబ్బ- ఎంత బాగా రాశాడో' అంటుంది మెచ్చుకుంటూ.

అక్కడితో ఊరుకోదు.

ఆ రచయితకు ఉత్తరాలు రాస్తుంది. వాళ్ళ ఆటోగ్రాఫ్స్ సేకరిస్తుంది. వాళ్ళ ఫోటోల కోసం ప్రాధేయ పడుతుంది. వాళ్ళ ఇళ్ళకో, ఆఫీసులకో వెళ్ళి గంటల తరబడి మాట్లాడుతూ పొగడుతూ గడుపుతుంది. వాళ్ళతో పెన్‌ఫ్రెండ్‌షిప్ చేస్తుంది.

అదంతా ఆమెకో పెద్ద గ్లామర్ ప్రపంచం.

నిషాకు ఎలాగయినా రచయితల ముసుగు వెనుక వున్న అసలు మనుషులను చూపించాలని ఉంది విజయకు. అప్పుడుగానీ ఆమె ఆలోచనా ధోరణిలో మార్పు రాదు.

ఇదివరకు ఈ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ ఆ మధ్య నిషా ఓ రోజు చెప్పిన మాటలు విజయను కలవరపెట్టినాయ్.

కాలేజికి ఓ రచయిత ఫోటో తీసుకొచ్చిందామె.

"విజయా! నీకో రహస్యం చెప్పనా?" అడిగిం దామె.

"ఏమిటది?"

"మళ్ళీ ఎవరితోనూ చెప్పవ్ కదూ?"

"నాకిదే పనేమిటి?" చిరాకుగా అంది.

"అదికాదే! చెప్తే కొంపలు మునిగిపోతాయ్! అందుకని—"

"ఇంతకూ సంగతేమిటో అఘోరించు-"

"ఇదిగో - ఈ రచయితను చూశావా? నేనితనిని ప్రేమిస్తున్నానే-" విజయకు నవ్వొచ్చేసింది.

"[illegible]"

"[illegible]"

"ఎందుకు?"

"ఎందుకేమిటి? 'పడకటింటి భాగోతం' ఎంత బాగా రాశాడో తెలుసా నీకు? హీరోయిన్ పడగ్గదిలో శపథం చేస్తుంది — భర్తకు తెలీకుండా భర్త ద్వారా పిల్లడిని కంటానని - అబ్బ అక్కడి నుంచీ - నిజంగా ఎంత థ్రిల్లింగ్‌గా రొమాంటిక్‌గా రాశాడో నీకేం తెలుస్తుంది?"

"అయితే ఆ రచయితను అభిమానించుగానీ

ఎకాఎకీన ప్రేమించటమేమిటి?''

''నీకు అసలు అర్థం కాదే అందులో వున్న ఇది-''

''సరే - పద - ఇంటికి పోదామిక-''

''విజయా! నాకో సహాయం చేస్తావా?''

''ఏమిటది?''

''నాతో ఇప్పుడు మార్కెట్ కొస్తావా?''

''ఎందుకు?''

''ఆ రచయిత అక్కడ హోటల్ రూమ్‌లో నా కోసం ఎదురుచూస్తుంటానన్నాడు.''

విజయ అదిరిపడింది.

''నువ్వొక్కర్తెవూ ఆ రచయిత హోటల్ రూమ్‌కెళ్తావా?''

''అందుకే కదా నిన్ను తోడు రమ్మంటోంది-''

విజయకు కోపం వచ్చేసింది.

''ఇదిగో నిషా! నువ్ చాలా తప్పుగా ఆలోచిస్తున్నావ్. ముక్కు మొఖం తెలీని వ్యక్తి దగ్గరకు ఒంటరిగా వెళ్ళడానికి సిద్ధమయావంటే నువ్వెంత ఫూల్‌వో తెలుస్తోంది.''

''వెళ్తే ఏం?''

''అక్కడ అతను నీతో అనుచితంగా ప్రవర్తిస్తే?''

''ప్రవర్తించనీ — అభిమానితో ఆ మాత్రం చనువుగా ప్రవర్తించే హక్కు రచయిత కుండ కూడదా?''

విజయ నిశ్చేష్టురాలయింది.

''అంటే నువ్వు - నువ్వు - ఇదిగో నిషా! మర్యాదగా ఇంటికొస్తావా లేక మీ వాళ్ళకు చెప్పమంటావా?''.

నిషా మొఖం చిన్నబోయింది.

''అసలు నీతో చెప్పటమే తప్పు-'' అంటూ రుసరుసా నడిచింది.

*　　*　　*

ఆ తరువాత నెల రోజులగ్గానీ నిషా కనిపించలేదు.

''ఏమయిపోయావ్ ఇన్ని రోజులూ?'' అడిగింది విజయ.

నిషా మొఖంలో అదివరకటి కాంతి లేదు.

''విజ్జీ! నువ్ చెప్పిన మాట విననందుకు ప్రతిఫలం!''

''ఏం జరిగింది?'' ఆత్రుతగా అడిగింది విజయ

''అతనితో గాఢ ప్రేమలో పడిపోయాను!''

''ఈ విషయం అతనికీ తెలుసా?''

''భలేదానివే - వన్‌వే ట్రాఫిక్ అనుకున్నావా?''

ఇద్దరూ అంత గాఢంగా ఒకరి నొకరు ప్రేమించుకుంటూంటే ఇంక ప్రాబ్లెమ్ ఏముంది? ఇద్దరూ పెళ్ళి చేసుకోవచ్చు కదా?''

''చేసుకుందామనే ఉంది... కానీ...''

''ఊ కానీ?''

''అతనికి వివాహమయిపోయింది కదా అదివరకే-''

విజయ అదిరిపడింది.

''అతనికి పెళ్ళయిపోయిందా?''

''అవును?''

''తెలిసి ఎలా ప్రేమించావ్?''

''ప్రేమను అవేమీ అడ్డుకోలేదే! నువ్ కూడా ఎప్పుడయినా ప్రేమలో పడితే తెలుస్తుంది—''

''అయితే ఇప్పుడేం చేయదల్చుకున్నావ్?''

''అదే అర్థంకావటం లేదు. అతనికి రెండో భార్యగా ఉండటానికి కూడా నేను సిద్ధమే! కానీ ఎందుకో భయంగా ఉంది. ఎటూ తోచక నీ దగ్గరకొచ్చాను - నీ సలహా కావాలి నాకు-''

విజయకు ఆమె మీద కోపం వచ్చింది.

''కానీ అతని భార్య మీ పెళ్ళికి ఒప్పుకోవద్దూ?''

''ఒప్పిస్తానని అన్నాడతను. అతనెలా చెప్తే అలా చేస్తుందట ఆమె!''

''అంటే ఇద్దరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటారా?''

''అవును! అందులో తప్పేముంది? ఇద్దరం ఆ ఏర్పాటుకు ఒప్పుకుంటే రెండు కుటుంబాలూ వేరు వేరుగా ఉండే ప్రాబ్లెమ్ పోతుంది కదా!''

విజయకు నవ్వాలో ఏడవాలో తెలీలేదు.

''సరే నన్నీ రాత్రికి ఆలోచించుకోనీ! ఉదయానికి నీకు నా అభిప్రాయం చెప్తాను-''

''సరే!'' నిషా దిగులుగా వెళ్ళిపోయింది.

మర్నాడు నిషా వచ్చేసరికి విజయ అందంగా అలంకరించుకుని ఆమె కోసమే ఎదురుచూస్తోంది.

''రా! రాత్రంతా నిద్రలేదు - నీ విషయం ఆలోచిస్తూనే వున్నాను. నువ్వు ఆ రచయితను చేసుకోవచ్చుగానీ ముందు కొంత కాలం నేనా రచయితను స్టడీ చేయాలి! అతని మనస్తత్వం, అతని అభిప్రాయాలూ, అతని ఆలోచనా ధోరణీ ఇవన్నీ తెలుస్తేనే గానీ అతనిని నువ్వు వివాహం చేసుకున్నాక ఆనందంగా ఉండలేవు. ఒకవేళ అతనిలో లోపాలేమయినా వుంటే ముందే తెలుసుకుని అప్పుడు పెళ్ళి గురించి నిర్ణయం తీసుకుంటే మంచిది! అందుకని నన్ను ఆ రచయితకు పరిచయం చెయ్! కొద్ది రోజుల తర్వాత నా అభిప్రాయం చెప్తాను-''

నిషా కళ్ళల్లో ఆనందం కనిపించింది.

''థాంక్యూ విజయా! నువ్ నాకీ సహాయం చేశావంటే జన్మంతా నీకు ఋణపడి వుంటాను - పద ఇప్పుడే అతని దగ్గరకెళ్దాం!''

ఇద్దరూ రచయిత ఆఫీస్‌కి బయల్దేరారు.

వారం రోజుల తర్వాత నిషా విజయ ఇంటికి చేరుకుంది.

''కమాన్! మీ రచయితను ఈ వారం రోజుల్లో నాలుగు సార్లు కలుసుకున్నానుగానీ ఇంకా పూర్తిగా అతని గురించి ఇన్‌ఫర్మేషన్ దొరకలేదు. అందుకే ఇవాళ హాలీడే కాబట్టి నాగార్జునసాగర్‌కి పిక్నిక్ వెళ్తున్నాం! అలాంటి చోటయితే రోజంతా అతనితో మాట్లాడుతూ స్టడీ చేయడానికి వీలవుతుంది - ఇంకాసేపట్లో బయల్దేరుతున్నాం ఇద్దరం-'' అందామె.

నిషా ఆనందంగా ఇంటికెళ్ళిపోయింది.

మరో వారం రోజుల వరకూ ఆమెకు విజయ కనిపించనే లేదు.

పొద్దున్నే వెళ్ళిపోయి రాత్రి పదీ, పదకొండు గంటలకు ఇంటి కొస్తోందని చెప్పారామె తల్లి దండ్రులు.

రానాను నిషాకు విసుగు పుట్టుకొస్తోంది.

చివరకు ఒక రోజు విజయే నిషా ఇంటికి చేరుకుంది.

ఆమె విచారంగా వుండడం చూసిన నిషా ఆశ్చర్యపోయింది.


''ఏమిటలా ఉన్నావ్?'' అడిగిందామె.

''నువ్వేమీ అనుకోనంటే ఒక మాట చెప్తాను-'' అందామె దిగులుగా.

''ఛ! మనిద్దరి మధ్యలో అనుకోవటాలేమిటి? సంగతేమిటో చెప్పు!''

''అదే! ఆ రచయిత గురించి! అనుకోకుండా నేనూ అతనితో ప్రేమలో పడిపోయానే!''

నిషా అదిరిపడింది.



''ఆ!'' అంది తెల్లబోతూ.

''అవును నిషా! నాకు తెలీకుండానే జరిగిపోయింది. ఆ రోజు నాగార్జున సాగర్ వెళ్ళినప్పుడు ఇద్దరం ఒకరి హృదయం ఒకరికి ఇచ్చుకున్నాం!''

నిషా మొఖం వాడిపోయింది.

''అంటే అతను నిన్ను కూడా ప్రేమిస్తున్నానని చెప్పాడా?'' బాధతో విలవిలలాడిపోతూ అంది.

''అవును! ఇద్దరం పెళ్ళి కూడా చేసుకుందామన్నాడు! నువ్వూ, అతని భార్యా ఇద్దరూ మా పెళ్ళికి తప్పక వస్తుంటారనీ, అందరం కలసి ఒకే ఇంట్లో ఉండవచ్చనీ అన్నాడు-''

''ఇదన్యాయం విజయా! నేను ప్రేమించిన వ్యక్తిని నువ్వు ప్రేమించడం నాకు ద్రోహం చేసినట్లే-'' అంది కోపంగా.

''ఆ రోజు నువ్వన్నావ్ గుర్తుందా? ప్రేమ ఎప్పుడు ఎవరి మీద కలుగుతుందో మనకే తెలీదని! అలాగే నాకూ కలిగింది!''

''నే నిప్పుడే వెళ్ళి ఈ విషయం అతనిని అడుగుతాను'' అంది నిషా ఉక్రోషంగా.

''అడిగితే అతను బాధపడతాడు! తర్వాత నీ యిష్టం!''

నిషా కేం చేయాలో తెలీలేదు.

మర్నాడు ఆమె ఇంటి ముందు నుంచే ఆ రచయితతోపాటు విజయ అతని స్కూటర్ మీద వెళ్ళడం కనిపించేసరికి ఆమెకు ఏడుపొచ్చేసింది.

మరో వారం తర్వాత నిషా ఇంటికి వచ్చింది విజయ.

''ఏమిటి వచ్చావ్?'' రుసరుసలాడుతూ అడిగిందామె.

''నువ్ అతనిని వారం రోజుల్నుంచీ కలుసు కోవడం లేదంట! అతను చాలా బాధపడుతున్నాడు. మనిద్దరినీ ప్రతి రోజూ చూడకుండా ఉండలేనంటున్నాడు - ఎలాగయినా ఇవాళ నిన్ను తీసుకురమ్మన్నాడు-''

''సారీ! నేను ఇంక అతని దగ్గరకు రాదల్చుకోలేదు-''

విజయ ఆశ్చర్యపోయింది.

''అదేమిటి? మనిద్దరం అతనిని పెళ్ళి చేసుకోబోతున్నామన్న సంగతి మర్చిపోయావా?''

''నేను అతనిని పెళ్ళి చేసుకోవటం లేదు.''

''ఎందుకని?''

''అతని హృదయం ఇంత విశాలమని నాకు అప్పుడు తెలీలేదు. కేవలం నాకూ, అతని భార్యకే చోటుంటుందనుకున్నాను-''

''ఇప్పుడు చూస్తే అది ఓ పెద్ద వసారాలా కనబడుతోంది కదూ? అయ్‌మీన్ ఇంకా ఎంతో మందికి చోటున్నట్లు-''

నిషా ఆమె వేపు చిరాకుగా చూసింది.

''సరే! నేను వెళ్తున్నాను నిషా! నేనూ, అతనూ వచ్చే వారం పెళ్ళి చేసుకోబోతున్నాం! కనీసం మా పెళ్ళికయినా వస్తావా?''

''నే నెక్కడికీ రాను!'' ఉక్రోషంగా అంది నిషా.

ఆ తరువాత కొద్ది రోజులకు నిషా పెళ్ళి మరికొద్ది సేపట్లో జరుగుతోందనగా వచ్చింది విజయ.

ఆమెను చూసి ముఖం తిప్పుకుంది నిషా.

''అలా ముఖం తిప్పుకోనక్కర్లేదులే! అదంతా నేనాడిన నాటకం! ఆ రచయిత నా మీద మోజుపడ్డ మాట నిజమే గానీ నేనతనిని ప్రేమించడం, పెళ్ళి చేసుకోవాలనుకోవటం అంతా నేనాడిన డ్రామా! ఆ డ్రామా కేవలం నిన్ను మార్చటానికి! నువ్విప్పుడు వేరే అతనిని వివాహం చేసుకుంటున్నావ్ గనుక ఇదంతా ఇప్పుడు బయటపెడుతున్నాను - ఇంక వెళ్ళనా మరి?''


నిషా ఛప్పున ఆమె చేయి పట్టుకుంది.

''సారీ విజయా! నిన్నర్థం చేసుకోలేకపోయాను!''

''అందుకే నా ప్లాన్ సక్సెస్ అయింది! అంచేత విచారపడకు-''

ఇద్దరూ నవ్వేశారు. ■


ప్రేమంటే చుంబనం కాదు;
ఆలింగనం అంతకన్నా కాదు



అని కాగితం మీద రాసి ఇచ్చింది
సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థిని

- టీనేజ్ రీడర్స్ కోసం, కాలేజీ
విద్యార్థిని రాస్తున్న సీరియల్

త్వరలో!